క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం కోసం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐలో అడ్మిషన్ కోసం దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన సాధించకపోయిన వారు కూడా అర్హులై అన్నారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతోపాటు కులధృవీకరణ పత్రం, ఆదాయపత్రము, ఆధార్‌కార్డు ఫొటోలతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

బైకు అదుపుతప్పి ఒకరికి గాయాలు


గాయపడిన పోతులయ్య

పులివెందుల రూరల్ : పులివెందుల–కదిరి రోడ్డులోని కంపోస్టు యార్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. సత్యసాయి జిల్లా మద్దన్నగారిపల్లెకు చెందిన గుజ్జల పోతులయ్య అనే వ్యక్తి తన సొంత పనుల నిమిత్తం పులివెందులకు వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా కదిరిరోడ్డులోని కంపోస్టుయార్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. పోతులయ్యకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు గుర్తించి 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

హిందీ పరీక్షకు ఇద్దరే హాజరు

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్న పదవ తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్షకు రెండు కేంద్రాలకు కలిపి 58 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 30 మందికి గాను 1, అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 28 మందికి గాను ఒకరు మాత్రమే హాజరయ్యారు.

నేటినుంచి వార్షికోత్సవ వేడుకలు


శ్రీ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో వెలసిన శ్రీ గోదా, మహాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ చతుర్థశ వార్షికోత్సవ, బ్రహ్మోత్సవాలు ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. 26, 27వ తేదీలలో సుప్రభాత సేవతో పాటు వివిధ రకాల, అభిషేకాలు, హోమాలు జరుగుతాయన్నారు. 28వ తేదీన శ్రీ గోదా, మహాలక్ష్మీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

నారాయణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ అడ్మిషన్ చేస్తున్న నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శనివారం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు పృథ్వీ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో డాక్టరేట్


నేలటూరు సారథి

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జేకేసీ మెంటార్‌గా పనిచేస్తున్న నేలటూరు సారథికి గణిత శాస్త్రంలో తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్వీయూ గణితశాస్త్రశాఖ ఆచార్యులు ఎ. సుధాకరయ్య, డా. ఎస్. ఉషారాణిల పర్యవేక్షణలో 'వేరియస్ స్టడీస్ ఆన్ స్ప్లిట్ అండ్ నాన్ స్ప్లిట్ డామినేటింగ్ సెట్స్ ఆఫ్ ఆన్ ఇంటర్వెల్ గ్రాఫ్ యూజింగ్ ఆన్ అల్గారిదం విత్ యాడ్ అండ్ ఈవెన్ వర్టినెస్' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

ముగిసిన మోక్ష నారాయణుడి బ్రహ్మోత్సవాలు


ఆలయ గోపురంపై కుంభాభిషేకం చేస్తున్న వేదపండితులు


పూజా సామాగ్రితో ఆలయ ప్రవేశం చేస్తున్న సాయినాథ శర్మ దంపతులు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 21వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ప్రముఖ వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉదయం మండప అర్చనలు, సర్వ సూక్త పారాయణం, సమస్త పరివార దేవతామూర్తుల హోమాలు, పూర్ణాహుతి, పంచామృత స్నానం, మహా కుంబాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జనులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణంలో భాగంగా చేపట్టిన స్వాముల వారి కల్యాణ వేడుకలను భక్తులు చూచి తరించి తన్మయత్వం పొందారు. ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం మోక్ష నారాయణుడు గరుడ వాహనంపై, సుబ్రహ్మణ్యస్వామి మయూర (నెమలి) వాహనంపై మాడ వీధులలో ఊరేగారు. రాత్రి డాన్స్ బేబి డాన్స్ సంగీత కళాకారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా పుష్పయాగం


వెయ్యినూతలకోనలో లక్ష్మినరసింహస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం 12 రకాల పుష్పాలతో వేదపండితుల సమక్షంలో 12 సార్లు లక్ష్మినరసింహస్వామి, లక్ష్మిదేవి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పుష్పయాగం చేశారు. పుష్పయాగానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వ్యాపార సంస్థల యజమానులు ప్లాస్టిక్‌కవర్లు వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ బదులు గుడ్డ, జనపనార సంచులను వాడాలన్నారు. బయోగ్రేడబుల్ వంటివి కూడా వాడవచ్చన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడినట్లు తెలిస్తే రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. వినియోగదారులు వాడినా రూ.500లు జరిమానా ఉంటుందన్నారు. పట్టణంలో ఉన్న అన్ని టిఫిన్ సెంటర్లు, హోటళ్లలో ఇడ్లీ తయారు చేయుటకు గుడ్డలను మాత్రమే వాడాలన్నారు. పట్టణ ప్రజలకు నాణ్య మైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు యదావిధిగా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒంటె వాహనంపై చెన్నకేశవుడు


పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి సంజీవరాయ స్వామిని ఒంటె వాహనంపై ఊరేగించారు. ముందుగా స్వామికి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారిని ఆశీనులు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని భజన పాటలు పాడుకుంటూ పురవీధుల్లో ఊరేగించారు.

నేడు యర్రదొడ్డి గంగమ్మతల్లి జాతర



లింగాల : అంకెవానిపల్లె గ్రామంలో వెలసిన శ్రీ యర్రదొడ్డి గంగమ్మతల్లి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 14 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఈ జాతరను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. శనివారం రాత్రి పూజా కార్యక్రమం నిర్వహించి అర్ధరాత్రి అంకెవారి అక్కమ్మగారి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అంకెవారి కడవ బోనంతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి గంమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఇనగలూరులో పోలీసుల నాకాబందీ


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తొండూరు : ఇనగలూరు గ్రామంలో ఎస్ఐ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నాకాబందీ నిర్వహించి అనుమానం ఉన్న ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరు కూడా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పోలీస్ ఆదేశాలను పాటించకుండా గొడవలకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రఘునాథరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

పోరుమామిళ్ల: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నిర్మించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన 9వ వార్షికోత్సవంలో డీసీ గోవిందరెడ్డి, పుల్లివీడు సర్పంచ్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్ ఆచారి, ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసాచారి, తిరుమలయ్యాచారి ఎమ్మెల్సీ, సర్పంచులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మఠం పీఠాధిపతులతో ఎమ్మెల్సీ ఆలయ అభివృద్ధి గురించి చర్చించారు. అవసరమైన సహకారం అందిస్తామన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం వేదపారాయణం, అఖండస్థాపన, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, సహస్రనామ పుష్పాభిషేకం అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వాముల శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు ప్రసవం సురక్షితం

బి.కోడూరు : ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులకు ప్రసవం సురక్షితమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ తెలిపారు. బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. శనివారం పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో మొదటి కాన్పుకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద రూ.5 వేలు నగదు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. అడల్ట్ బీసీజీ గురించి ప్రజలకు తెలియజేసి బీసీజీ టీకా వేయాలన్నారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్ కుమార్ ఆర్‌సీహెచ్, సీఎస్ఎస్‌హెచ్, హెచ్ఐఎంఎస్ రిపోర్ట్స్ గురించి తెలియజేశారు. సమావేశంలో సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్స్ జాన్‌విలియం, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి వజ్రాల (వరాల) సుంకులమ్మ బ్రహ్మోత్సవాలు


కమలాపురం చెరువుగట్టుపై వెలసిన సుంకులమ్మ ఆలయం


సుంకులమ్మతల్లి మూలవిరాట్

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపం చెరువుగట్టుపై వెలసిన శ్రీ వజ్రాల(వరాల) సుంకులమ్మతల్లి 9వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 27న ఉదయం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనము, పంచగవ్య ఆరాధన, ప్రధాన కలశ స్థాపన, సుంకులమ్మ దేవత పంచామృత అభిషేకములు నిర్వహించనున్నారు. 28వ తేదీన అమ్మవారి మూల విగ్రహాలకు విశేష పంచామృత అభిషేకము, మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సర్వసతి, నవగ్రహ, విశేష పూజలు నిర్వహిస్తారు. 29న ప్రాతః కాల పూజలు, మూలమూర్తికి ఉత్సవ విగ్రహములకు విశేష అభిషేకాల నిర్వహించనున్నారు. 30న అమ్మవారికి విశేష అభిషేకములు, అలకంరణ తదుపరి కుష్మాండబలి, పూర్ణాహుతి, మహా గణపతి హారతి తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

29న బండ లాగుడు పోటీలు :
శ్రీ వరాల సుంకులమ్మ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు కమలాపురం ప్రాంతపు ఇసుక తోలే ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.1వెయ్యి నగదు బహుమతులు ఇవ్వనున్నారు.

30న పాల పళ్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు:
వరాల సుంకలమ్మ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 30న పాలపళ్ల విభాగం ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ. 50 వేలు, రూ.40వేలు, రూ. 30 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందజేయనున్నారు.

ఏడు గేదెల మృతి

కొండాపురం: మండలంలోని దత్తాపురం గ్రామానికి చెందిన పాడి రైతు బెస్త అంకన్నకు చెందిన ఏడు గేదెలు శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. వాటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా న్యాయం చేయాలని ఆయన కోరారు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

కలసపాడు : జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి దృష్ట్యా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు నోడల్ డీఎస్పీ రవికుమార్, పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, కలసపాడు ఎస్ఐ నాగమురళి హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని వివిధ పంచాయతీలకు చెందిన గ్రామాల్లోని అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పాటిస్తూ ప్రజలు, రాజకీయ నాయకులు శాంతికి సహకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు రోజు, తర్వాత 144 సెక్షన్, ఎన్నికల కోడ్ అమల్లో ఉంటాయని తెలిపారు. గుంపులు గుంపులుగా ఉండటం, బాణాసంచా పేల్చడం వంటి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. ఘర్షణలు సృష్టిస్తే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

పద్యపఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పద్యపఠనాన్ని అలవరచుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు పేర్కొన్నారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణతరగతుల్లో భాగంగా విద్యార్థులకు పద్యపఠనంపై అవగాహన కల్పించారు. పద్యపఠనం వలన మానవతా విలువలు పరిమళిస్తాయని, భాష మీద పట్టు వస్తుందన్నారు. వేమన, సుమతీ, శతక పద్యాల గురించి విద్యార్థులకు వివరించారు.

అంతర్ పంటలతో రైతులకు లాభాలు


చీనీలో అంతర్ పంటగా వేసిన చిక్కుడు

పులివెందుల రూరల్ : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగుచేస్తే తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని రైతులు అంతర్ పంటలు సాగుచేస్తున్నారు. పులివెందుల ప్రాంతంలో చీనీసాగు చేస్తే అంతర్ పంటలుగా మిరప, టమోట, చిక్కుడు, కలింగర, తదితర పంటలు సాగుచేయడం వల్ల లాభాలు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల ఎక్కువశాతం రైతులు తక్కువ విస్తీర్ణంలో రెండు రకాల పంటలు సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో పవళింపు సేవ


పవళింపు సేవలో అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి పవళింపు సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేంగా నూతన పట్టువస్త్రాలు, పూలతో, ఆభరణాలతో అలంకరించి పవళింపు సేవను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


నాయునిపల్లెలో కోలాటం వేస్తున్న దృశ్యం

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామంలో శ్రీఅవధూత కాశినాయన 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. 1993వ సంవత్సరంలో శ్రీఅవధూత కాశినాయన జీవించి ఉండగానే గ్రామస్తులు ఆయనకు ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ప్రతి సంవత్సరం ఘనంగా వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఆయన విగ్రహాన్ని మంగళ, డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన ఆకాంక్షారెడ్డి ఆధ్వర్యంలో వేసిన కోలాటం ఆకట్టుకుంది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు ఉచిత భోజన వసతి, మజ్జిగ పంపిణీ చేశారు.

కల్యాణం.. కమనీయం..


అమ్మవారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు


కల్యాణోత్సవంలో రేణుకా యల్లమాంబ

సిద్దవటం : మండలంలోని మాచుపల్లెలో శ్రీ రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం సాయంత్రం వైభవోపేతంగా జరిగింది. జగజ్జననీ శ్రీ రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహర్షి ఉత్సవ మూర్తులకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, యజ్ఞోప విధారణ, కంకణాధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు వేదమంత్రాల మధ్య మంగళ వాయిద్యాలతో అమ్మవారి కల్యాణం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకొని కాయాకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి కల్యాణం తిలకించారు.